క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటాపురం(కె): ఓపెన్ స్కూల్ పదో తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 8వ తేదీ నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం జీవీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్ కార్డు జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, టీసీతో జిల్లా పరిషత్ పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

గుంతలు పూడ్చిన పోలీసులు



ఏటూరునాగారం: ఏటూరునాగారం 163వ జాతీయ ప్రధాన రహదారి చిన్నబోయినపల్లి –తాడ్వాయి మార్గంలో రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారిన గుంతలను ఏటూరునాగారం పోలీసులు గురువారం పూడ్చివేశారు. స్థానిక ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతలను సిబ్బందితో కలిసి పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుంతల్లో వర్షం నీరు నిలిచిఉండడంతో వాహనదారులు గమనించకుండా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు.

దాడిలో గొత్తికోయ మహిళ మృతి


మంగమ్మ మృతదేహం

ఎస్ఎస్తాడ్వాయి: మండలంలోని నార్లాపూర్ పరిధిలోని తక్కళ్ల పాడు గొత్తికోయ గూడేనికి చెందిన ఓ మహిళ కోరం మంగమ్మను కర్రతో కొట్టడంతో మృతి చెందినట్లు తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తక్కళ్లగూడేనికి చెందిన కోరం మంగమ్మ(35) తన భర్తతో అక్రమ సంబంధం నెరపుతుందనే అనుమానంతో.. అదే గూడేనికి చెందిన సోయం కమలను బుధవారం దూషించింది. దీంతో కమల ఉద్రేకానికి గురై మంగమ్మను వెదురు కర్రతో తలపై కొట్టడంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు మహేశ్ గురువారం అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

దిగబడిన వాహనాలు..



కాటారం: కాటారం–మంథని ప్రధాన రహదారి రోడ్డులో వాహనాలు దిగబడి గురువారం మంథని వైపుగా సుమారు నాలుగు గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కాటారం నుంచి ధన్వాడ వరకు కొన్ని రోజులుగా ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ ఓ పక్క మెటల్ గ్రావెల్ పనులు కొనసాగిస్తుండగా మరో పక్క రోడ్డు మట్టి లోతుగా తీయబడింది. వర్షాల కారణంగా రహదారి బురదమయంగా మారడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో నిత్యం వాహనాలు బురదలో దిగబడుతున్నాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున ధన్వాడలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ సమీపంలో పలు వాహనాలు బురదలో కూరుకుపోయాయి. ఉదయం వరకు వాహనాలు అలాగే బురదలో ఉండటంతో మిగితా వాహనాలు వెళ్లే పరిస్థితి లేక ట్రాఫిక్ జాం అయింది. ఆర్అండ్‌బీ అధికారులు, సదరు రోడ్డు కాంట్రాక్టర్ శ్రమించి ప్రొక్లెయినర్ సాయంలో బురదలో కూరుకుపోయిన వాహనాలను బయటకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. కొంత సమయం పాటు వాహనాలను అటువైపుగా అనుమతించకుండా భూపాలపల్లి వెళ్లే వాహనాలను కొయ్యూర్, ఎడ్లపల్లి, రుద్రారం మీదుగా భూపాలపల్లికి మళ్లించారు. కాళేశ్వరం వైపుగా వెళ్లే వాహనాలను గంగారం మీదుగా పంపించారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

'డబుల్' ఇళ్లు కేటాయించాలి

భూపాలపల్లి రూరల్: గతంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులుగా గుర్తించిన వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు గురువారం కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలోని భాస్కర్ గడ్డ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గతంలో పూర్తి స్థాయిలో విచారణ చేసి అర్హులైన 393మందికి కేటాయించినట్లు తెలిపారు. కానీ ప్రస్తుత ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులచే లబ్ధిదారుల లిస్టు తయారు చేయించి విచారణ చేయకుండా 416 ఇళ్ల జాబితాను కలెక్టర్‌కు పంపించినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో జిల్లా స్థాయి అధికారులచే పారదర్శకంగా విచారణ చేయించిన తరువాతనే లబ్ధిదారులకు చెందే విధంగా ఇళ్లను కేటాయించాలన్నారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి తప్పకుండా విచారణ చేపిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

జోరుగా నాటుసారా తయారీ

- గుట్టుగా గుడుంబా బెల్లం వ్యాపారం
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ



మంగపేట: మండలంలో గుడుంబా తయారీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అరి కట్టాల్సిన ఎక్సైజ్ శాఖ తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో గ్రామాల్లో గుడుంబా తయారీని కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా వెలుస్తోన్నాయి. మండలంలోని కమలాపురం, తిమ్మంపేట, నర్సింహాసాగర్, బాలన్నగూడెం గ్రామాలకు చెందిన కొందరు గుడుంబా తయారీదారులు ద్విచక్ర వాహనాలపై గుడుంబాను తరలించి మంగపేట, మల్లూరు, చుంచుపల్లి తదితర గ్రామాల్లోని గుడంబా విక్రయదారులకు చేరవస్తున్నారు. దీంతో గ్రామాల్లో వీధికి నాలుగు నుంచి 10 వరకు బెల్టు షాపులు ఉండగా అందులో రెండు మూడు బెల్టు షాపుల నిర్వాహకులు గుడుంబా విక్రయాలు బహిరంగంగా నిర్వహిస్తున్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని దుగినేపల్లికి చెందిన కొందరు గుడుంబా తయారీదారులు నిత్యం ఉదయం సాయంత్రం బ్రాహ్మణపల్లి, కత్తిగూడెం, దోమెడ, రాజుపేట, రమణక్కపేట గ్రామాల్లోని విక్రయదారులకు ద్విచక్ర వాహనాలపై గుడుంబాను చేరవేస్తున్నారు. అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి.

బెల్లానికి పెరిగిన డిమాండ్

గుడుంబా తయారీ, విక్రయాలు పెరుగుతుండడంతో గుడుంబా తయారీకి వినియోగించే బెల్లం, పటికకు డిమాండ్ పెరిగింది. దీంతో అక్రమ బెల్లం వ్యాపారంతో సొమ్ము చేసుకునేందుకు కొందరు బెల్లం వ్యాపారాన్ని ఎంచుకున్నట్లు సమాచారం. రాజకీయ పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు, ఓ కిరాణ షాపు యజమానితో కలిసి ఒకరిద్దరు ఎక్సైజ్, పోలీసులను మచ్చిక చేసుకుని గత కొద్ది రోజులుగా బెల్లం దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. వారికి అనుకూలమైన రోజుల్లో రాత్రి వేళల్లో ఛత్తీస్‌గఢ్‌తోపాటు మేడారం నుంచి వాహనాల్లో బెల్లం, పటికను తీసుకొచ్చి గుడుంబా తయారీ విక్రయదారులకు నేరుగా చేరవేస్తునట్లు తెలుస్తోంది. వరంగల్ నుంచి కిరాణం సరుకులతోపాటు బెల్లం, పటికను దిగుమతి చేసుకుంటూ వ్యాపారాన్ని గుట్టుగా సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గుడుంబా తయారీ విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలున్నాయి. బెల్లం సరఫరా చేస్తున్న వ్యక్తుల మధ్యవర్తిత్వంతో కొందరు ఎక్సైజ్ శాఖ అధికారులు నెల నెలా గుడుంబా తయారీ విక్రయదారుల నుంచి ముడుపులు తీసుకుంటూ సహకరిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. నెల నెలా ముడుపులు ఇవ్వనివారి ఇళ్లపై అడపా దడపా దాడులు నిర్వహిస్తూ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్నారని సమాచారం.

దాడులు చేస్తున్నాం



గుడుంబా తయారీ విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో దాడులు నిర్వహించి కేసులు పెట్టి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశాం. నిబంధనలు అతిక్రమించినవారికి నోటీసులు సైతం జారీ చేశాం.

– రామకృష్ణ, ఎక్సైజ్ సీఐ, ఏటూరునాగారం

పిచ్చిమొక్కల నడుమ విద్యావనరుల కేంద్రం



కన్నాయిగూడెం: కన్నాయిగూడెంలోని విద్యావనరుల కేంద్రం పచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది. విద్యావనరుల కేంద్రం చుట్టూ పచ్చిమొక్కలు, గడ్డితో కళాహీనంగా మారింది. విద్యావనరుల కేంద్రానికి వెళ్లేందుకు దారి కూడా సరిగా లేదు. బురద నీటిలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి. విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తుంటారు. విద్యా అభివృద్ధి కార్యక్రమాలన్నీ ఇక్కడనుంచే జరుగుతుంటాయి. మంగపేట మండలం ఎంఈఓ కన్నాయిగూడెం అదనపు ఎంఈఓగా పనిచేస్తున్నారు. ఆయన మంగపేటకు పరిమితం కావడంతో విద్యావనరుల కేంద్రాన్ని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యావనరుల కేంద్రం మారుమూల ప్రాంతంలో ఉండడంతో జిల్లా విద్యాధికారులు పర్యవేక్షించిన దఖాలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. స్వచ్ఛదనం– పచ్చదనం నిర్వహిస్తున్న అధికారులు విద్యావనరుల కేంద్రం చుట్టూ ఉన్న పరిస్థితులను చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

లబ్ధిదారుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని సూరవీడు గ్రామానికి చెందిన రాజేశ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును గురువారం వారి కుటుంబ సభ్యులకు సీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, మాజీ జెడ్పీటీసీ పాయం రమణ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, నాయకులు బాలసాని వేణు, మద్దుకూరి ప్రసాద్, గోవింద్, చిడెం ముత్తయ్య తదితరులు ఉన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవు


ఏటూరునాగారం: అవగాహన కల్పిస్తున్న సీఐ


గోవిందరావుపేట: అవగాహన కల్పిస్తున్న ఎస్సై

- సీఐ శ్రీనివాస్

ఏటూరునాగారం: విద్యార్థులు తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహపూర్వకంగా కలిసి విద్యనభ్యసించాలని సూచించారు. సరదాలకు వెళ్లి కష్టాలు తెచ్చుకోవద్దని, తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని తెలిపారు. కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

ర్యాగింగ్ నేరం

గోవిందరావుపేట: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. పస్రా ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఆయన ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, తోటివిద్యార్థులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేయొద్దని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులుగా ఉన్న సమయంలో కేసులు నమోదైతే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ ఉద్యోగాలు సాధించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యాసంస్థ యజమానులు విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తమని సంప్రదించాలని అన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటాపురం సీఐ బండారి కుమార్ ర్యాగింగ్ యాక్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే బాధితులు టోల్ ఫ్రీ నంబర్ 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై తిరుపతిరావు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్


రంగులు వేస్తున్న కార్మికులు

ఏటూరునాగారం: నేడు(శుక్రవారం) ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం ఏటూరునాగారం బస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఆదివాసీ సంఘాలు నాయకులు, ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో ప్రాజెక్ట్ అధికారి చిత్రామిశ్ర ఆధ్వర్యంలో కొమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి జెండా ఆవిష్కరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీడీఏ ప్రాంగణంలోని కొమురం భీమ్ విగ్రహాన్ని ముస్తాబు చేస్తున్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కొప్పుల రవి, పొడె శోభన్, పులిశె బాలకృష్ణ తదితరులు పిలుపునిచ్చారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమ్మెలో పాల్గొన్న నాయకులు, జీపీ కార్మికులు

వెంకటాపురం(కె): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కుమ్మరి శ్రీను అన్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గురువారం మండలంలోని 18 జీపీల కార్మికులు ఒక్క రోజు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అర్హత ఉన్న ఉద్యోగులను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించి, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. నర్సింహాచారి, శ్రీను, రంజిత్, జయమ్మ, బుచ్చిబాబు, సురేష్ ఉన్నారు.

కాంగ్రెస్‌వి 6గ్యారంటీలు.. 66 అబద్ధాలు

- బీజేపీ మండల అధ్యక్షుడు తేజరాజు


పస్రా సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

గోవిందరావుపేట: కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలు 66 అబద్ధాలతో అనేక హామీలతో అధికారంలోకి వచ్చిందని బీజేపీ మండల అధ్యక్షుడు మద్దినేని తేజరాజు అన్నారు. పస్రాలో గురువారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కృష్ణాకర్ రావు, మండల ఇన్‌చార్జ్ శ్రీలమంతుల రవీంద్ర చారి మాట్లాడారు. రేవంత్ రెడ్డి గ్యారంటీలను అమలు చేయకుండా దాటవేసే దోరణిలో పాలన సాగిస్తున్నారని తెలిపారు. హామీలు అమలు అయ్యేదాక ఉద్యమాలు చేస్తామన్నారు. సమావేశంలో అనేక రాజకీయ తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు చెవుగాని స్వప్న, జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, మండల అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు రాజన్న నాయక్, ధర్మారావు, శ్రీనివాస్, చంద్రమౌళి, సదానందం, సమ్మయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం


కన్నాయిగూడెం: అవగాహన కల్పిస్తున్న వైద్యులు


ఎస్ఎస్తాడ్వాయి: పరీక్షిస్తున్న డాక్టర్ చిరంజీవి


వాజేడు: గుమ్మడి దొడ్డిలో..

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని డాక్టర్ అభినవ్ అన్నారు. మండల పరిధిలోని తుపాకులగూడెం గ్రామ పంచాయతీలోని గుట్టలగంగారం గొత్తికోయగూడెంలో గురువారం స్వచ్ఛదనం –పచ్చదనంపై అవగాహన కలిపించి, వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో వివిధ సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే ఇంటింటికీ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం తుపాకులగూడెంలోని ఆశ్రమ గిరిజన పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కలుషిత ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. లక్ష్మణ్, ఏఎన్ఎం సవిత, ఆశాలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

ఎస్ఎస్తాడ్వాయి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు వ్యాప్తిం చెందకుండా ఉంటాయని తాడ్వాయి పీహెచ్‌సీ వైద్యాధికారి అడెపు చిరంజీవి అన్నారు. గురువారం మండల కేంద్రం సమీపంలోని కామారం(పీటీ) గ్రామపంచాయతీ పరిధిలోని గొత్తికోయగూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గూడెంలోని 84 మందిని పరీక్షించి జలుబు, దగ్గు, కాళ్ల నొప్పులు ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. గర్భిణులను పరీక్షించి సూచనలు చేశారు. సిబ్బందితో కలిసి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఏఎన్ఎం మంగ, అంగన్‌వాడీ టీచర్ కొర్నెబెల్లి జానకి ఉన్నారు. మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అవిలయ్య అన్నారు. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ కొమ్మాల సంధ్య, ఎంపీఓ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి రేఖ రాజశేఖర్, నరసింహస్వామి, శ్రవణ్, , స్వామి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన వైద్యశిబిరాలు

వాజేడు: వాజేడు వైద్యులు కొమరం మహేందర్, గ్నానస, యోషిత, పేరూరు వైద్యాధికారి రాహిల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గ్రామ గ్రామాన గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. వర్షాలు పడుతుండటంతో జ్వరాల తీవ్రత ఎక్కువ కాకుండా ముందస్తుగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. గురువారం చీకుపల్లి, గుమ్మడి దొడ్డి, ఘణపురం, జంగాలపల్లి, మొరుమూరు, ప్రగళ్ల పల్లి, భువన పల్లి గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు కొనసాగాయి. జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు. స్వచ్ఛదనం– పచ్చదనంలో భాగంగా ఈ వైద్య శిబిరాల ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాల వద్ద గ్రామ పంచాయతీల కార్యదర్శులు అందుబాటులో ఉండి ప్రజలకు పలు సూచనలను చేశారు.

ఇంటింటా సర్వే..

వెంకటాపురం(ఎం): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం ఆరు బృందాలుగా విడిపోయి వెంకటాపురం, పాలంపేట, లక్ష్మీదేవిపేట, అందుగులమీది, అడవిరంగాపూర్, లింగాపూర్, బుర్గుపేట, మల్లయ్యపల్లి, నల్లగుంట గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సుమారు 1,800 మందికి వైద్య సేవలందించారు. ప్రజలు పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శ్రీకాంత్ సూచించారు.


వెంకటాపురం(కె) : పాత్రాపురంలో..


దొడ్లలో సర్వే చేస్తున్న వైద్యుడు ప్రణీత్


ఎస్ఎస్తాడ్వాయి: ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


వెంకటాపురంలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కంప్యూటర్ బహూకరణ


కంప్యూటర్‌ను అందజేస్తున్న హరికృష్ణ

భూపాలపల్లి రూరల్: జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ కంప్యూటర్‌ను బహూకరించారు. కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్ ఆదేశానుసారం గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌కు కంప్యూటర్ అందజేసినట్లు ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం డిగ్రీ కళాశాల యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయుడు విజ్ఞప్తి చేశారు.

బీజేపీలో చేరిక

కాళేశ్వరం: మహదేవపూర్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆకుల శ్రీధర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి పలువురు గురువారం బీజేపీలో చేరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- చిట్యాల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీదేవి

చిట్యాల: రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా గుమ్మడి శ్రీదేవి, వైస్ చైర్మన్‌గా ఎండీ.రఫీతో పాటు పాలకవర్గ సభ్యులను మార్కెట్ కమిటీ సెక్రటరీ కనక శేఖర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధికి పాలకవర్గ సభ్యులతో కలిసి శక్తి వంచన లేకుండా కష్టపడి పనిచేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ఆగస్టులోగా పూర్తిగా రుణమాఫీ చేయనున్నట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు కలిసికట్టుగా పనిచేసి మార్కెట్ అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. నిజాయితీగా పరిపాలన అందించాలని.. మండలంలో ఎక్కడైనా పేదల దగ్గర నుంచి ఒక్క రూపాయి తీసుకున్నా సహించేది లేదని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని రోడ్లను బాగుచేస్తానని అన్నారు. గాంధీనగర్‌లో రూ.176 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలకు త్వరలో నే పునాది రాయి వేస్తానని హామీఇచ్చారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మండలకేంద్రంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. చిట్యాల, ఒడితలలో పల్లె దవాఖానాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు గాజర్ల అశోక్ (ఐతు), రాంనర్సింహారెడ్డి, సంపత్‌రావు, దబ్బెట రమేష్, మధువంశీకృష్ణ, అప్పం కిషన్, చల్లూరి మధు, మాజీ జెడ్పీటీలు పులి తిరుపతిరెడ్డి, కాంట్రేవుల సాయిలు, సమ్మయ్య, కిష్టయ్య, కొంరయ్య, దబ్బెట అనిల్, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

ఎస్సీ డిక్లరేషన్‌కు నిధులు కేటాయించాలి


వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

మంగపేట: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్‌కు అనుగుణంగా నిధులు కేటాయించలాని డిమాండ్ చేస్తు బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ బైరి వీరస్వామికి గురువారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పల్నాటి సతీశ్ మాట్లాడారు. ఎస్సీ డిక్లరేషన్‌లోని అంబేడ్కర్ అభయహస్తం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు, ఎస్సీ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునర్నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రావుల జానకిరావు, బొల్లికొండ సాంబయ్య, ఈర్ల మధు, బట్ట సతీశ్, ఎంబడి నవీన్, గుండు రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9705748198
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R) : 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944